క్లుప్తంగా

బాధితులకు అండగా సీఎం జగనన్న

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట) : సీఎం సహాయనిధి ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం మంజూరు చేసి బాధిత కుటుంబాలకు జగనన్న అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి రూ.6 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా విద్య, వైద్యం, వ్యవసాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు.

కియా ఈవీ-6 కారు ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్) : నగరంలోని హైవేపై ఉన్న హోషి ఆటో ప్రైవేటు లిమిటెడ్ కియా షోరూమ్‌లో కియా ఈవీ-6 ది ఎలక్ట్రిక్ సూపర్ స్టార్ కారును బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా ఈవీ 6లో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ కారు బ్యాటరీకి ఎనిమిదేళ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వారెంటీతో ఇస్తున్నామన్నారు. ఈ కారు ఎక్స్‌షోరూం ధర రూ.60.95 లక్షలు ఉందన్నారు. డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషి మారెడ్డి, సి.ఆశిస్‌రెడ్డి, షోరూమ్ జనరల్ మేనేజర్ సతీష్‌బాబు, మేనేజర్ భూపతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుల్‌టైమ్ స్కేల్ అమలు చేయాలి

నెల్లూరు (టౌన్) : సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారికి ఫుల్‌టైమ్ స్కేల్‌ను అమలు చేయాలని సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జేఏసీ నేత రామారావు డిమాండ్ చేశారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీసీ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, ధనలక్ష్మి, పిచ్చిరెడ్డి, బుజ్జయ్య పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరరెడ్డికి పదోన్నతి

నెల్లూరు(క్రైమ్) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారి కె.నాగమల్లేశ్వరరెడ్డి ఈఎస్‌గా పదోన్నతి పొందారు. సత్తెనపల్లికి చెందిన నాగమల్లేశ్వరరెడ్డి ఎక్సైజ్‌శాఖలో ఏఈఎస్‌గా బాధ్యతల్లో చేరారు. రాజమండ్రి డిపో మేనేజర్‌గా పనిచేస్తూ ఈ ఏడాది అక్టోబర్‌లో నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఎస్‌లకు ఈఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నాగమల్లేశ్వరరెడ్డి ఈఎస్‌గా పదోన్నతి పొందారు.

డిమాండ్లను పరిష్కరించాలి

నెల్లూరు(దర్గామిట్ట) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్రశిక్ష అభియాన్ జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఇందుకు బహుజన టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో బీటీఏ నగరాధ్యక్షుడు ఖాజారహంతుల్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

కృష్ణచైతన్యలో న్యాయవిజ్ఞాన సదస్సు

నెల్లూరు (టౌన్) : కాకుటూరులోని కృష్ణచైతన్య పీజీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వాణి హాజరై, విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఫణికుమార్, పారా లీగల్ వలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించాలి

నెల్లూరు సెంట్రల్ : నగరంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుంచి ప్రజలను కాపాడాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. పలుచోట్ల కుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని నివారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అధ్యయనోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వైష్ణవాలయాల్లో అధ్యయనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కనుల పండువగా జరుగుతున్నాయి. పగల్‌పత్తు ఉత్సవాల్లో ఎనిమిదో రోజు బుధవారం ఆయా ఆలయాల్లో కొలువైన స్వామివారు విశేషాలంకారాల్లో భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రంగనాథస్వామి దేవస్థానంలో..

రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఉభయ దేవేరులతో తల్పగిరి రంగనాథుడు గొల్లబోయి అలంకరణలో బుధవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్యశెట్టి వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో..

మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వటపత్రసాయి అలంకారంలో దర్శనమిచ్చారు.



గొల్లబోయి అలంకరణలో రంగనాథుడు

ఉభయకర్తలుగా దేవిశెట్టి వీరవెంకటసుబ్బయ్య వ్యవహరించారు. కార్యక్రమాలను ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పర్యవేక్షించారు.



వటపత్రసాయి అలంకరణలో వేణుగోపాలుడు

మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

• సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని మూలాపేటలో ఉన్న జంగమ భవన్‌లో నగర నియోజకవర్గానికి చెందిన మత్స్యకారులతో ఎమ్మెల్యే అనిల్ బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మత్స్యకార కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి చైర్మన్ పదవికి మన జిల్లా నుంచి తీసుకోవాలన్న ఆలోచనతో కొండూరు అనిల్‌బాబును రాష్ట్ర చైర్మన్‌గా చేసుకోగలిగామన్నారు. పట్టపు ప్రాంతాల్లో చాలా పనులు మన ఆప్కాఫ్ చైర్మన్ ద్వారా సాధించామన్నారు. మైపాడు రోడ్డు నిర్మాణంలో ఉన్నందున ఆ ప్రాంతంలో ఉన్న గోడలు తొలగించామన్నారు. రోడ్డు పనులు పూర్తయిన వెంటనే చేపల మార్కెట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే విధంగా మత్స్యకారులందరూ దీవించాలన్నారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, మత్స్యకార మార్కెట్ సొసైటీ నగరాధ్యక్షురాలు అరుణమ్మ, పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, శివకుమార్, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహారావు పాల్గొన్నారు.

వీఎస్‌యూ విద్యార్థులపై దాడి హేయం

నెల్లూరు (టౌన్) : విక్రమ సింహపురి యూనివర్సిటీలో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులపై ఏబీవీపీ నేతలు దాడులు చేయడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీలో కులమతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటుంటే ఏబీవీపీ నేతలు మారణాయుధాలతో వెళ్లి విద్యార్థులపై దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన ఏబీవీపీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష, నాయకులు నరేంద్ర, సంతోష్, బాలాజీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరురూరల్ : 41వ డివిజన్ సాయినగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులకు మేయర్ స్రవంతి, విజయా డెయిరీ చైర్మన్ రంగారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాల వారికి మేలు జరుగుతోందన్నారు. స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

వచ్చేనెల 2 నుంచి బ్రిడ్జి కోర్సు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ ఐటీఐల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండో సంవత్సరం ప్రవేశం కోసం బ్రిడ్జి కోర్సును స్థానిక వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐలో వచ్చేనెల 2 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలురు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ బాలురు ఐటీఐను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



నెల్లూరురూరల్ : 18వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 9వ డివిజన్‌లో..

నెల్లూరురూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని 18వ డివిజన్‌లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని కార్పొరేటర్ అశోక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

పలు డివిజన్‌లలో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని పలు డివిజన్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బుధవారం నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు 5వ డివిజన్ పీసీనాయుడు వీధి సచివాలయంలో కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే 9వ డివిజన్ కుసుమ హరిజనవాడ-1 సచివాలయంలో కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, 43వ డివిజన్ హనుమాయమ్మ వీధి సచివాలయంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, 51వ డివిజన్ కపాడిపాళెం-1 సచివాలయంలో కార్పొరేటర్ సాహిత్య ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది.

ఫిబ్రవరిలో మాదిగల యుద్ధభేరి మహాసభ

నెల్లూరు (వేదాయపాళెం) : మాదిగల హక్కుల సాధన లక్ష్యంగా ఫిబ్రవరి మాసంలో నగరంలో యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వందింటి సుబ్బయ్య మాదిగ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించడమే ధ్యేయంగా ఏపీ ఎమ్మార్పీఎస్, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 31వ తేదీన చలో విజయవాడ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో వెంటనే ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరిపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాట తప్పిందని, వర్గీకరణ ఉద్యమాన్ని మందకృష్ణ మాదిగ తాకట్టు పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాతంగి కృష్ణ, బర్రె శ్రీనివాసులు, వెంకట్రావు మాదిగ, కన్యకేశ్వరరావు, డేగ రాఘవేంద్ర, ముదిగొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య మాదిగ

మహిళా వాకర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో మహిళా వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎం.భారతి, సెక్రటరీగా వి.ప్రమీలమ్మ, ట్రెజరర్‌గా కె.సుశీలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు.



మెన్స్ టోర్నీ బ్రోచర్ ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 24న నెల్లూరు క్లబ్‌లో ఒక్కరోజు మెన్స్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. నవాబుపేటలోని ఆయన కార్యాలయంలో జిల్లా నాన్ మెడలిస్ట్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టోర్నమెంట్ బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కరోజు టోర్నీలో అండర్- 18, 18-35, 35-45, 45-55 ఏళ్ల దాటిన వారు కూడా పాల్గొన వచ్చన్నారు. ఉదయం 7 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 23 వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, రామలింగారెడ్డి, చంద్రారెడ్డి, శివారెడ్డి, నారాయణరావు, రత్నాకర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ-98 అభ్యర్థుల హర్షం

నెల్లూరు (టౌన్) : డీఎస్సీ- 98లో మిగిలిన రెండు వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనపై డీఎస్సీ-98 అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నెల్లూరు సెంట్రల్ : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరులోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయదారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని, అదేవిధంగా కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణంలో ఎలాంటి మందుల స్టాక్ ఉందో తెలియజేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రసాయన ఎరువులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి ఎస్వీ నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.




ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

మంత్రిని కలిసిన నుడా చైర్మన్

నెల్లూరు(దర్గామిట్ట) : నుడా చైర్మన్‌గా తన పదవీ కాలాన్ని పొడిగించడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ముక్కాల ద్వారకనాథ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

కృష్ణ మందిరంలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని శ్రీకృష్ణ మందిరంలో ఆండాళ్ గోదాదేవి అమ్మవారికి నాలుగో రోజు బుధవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మందిరంలో వెలిసిన అభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, గణపతిహోమం, రుద్రహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా నామా రామమూర్తి, ఝాన్సీలక్ష్మి, విజయకుమార్‌రెడ్డి, మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు.

ఐక్య సింహపురి క్రిస్మస్ నేడు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ మైదానంలో 'ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం-2023'ను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ కన్వీనర్ బర్నాబాస్ తెలిపారు. ఈ మేరకు వీఆర్సీ మైదానంలో ఆహ్వాన పత్రికలను ఫాదర్ జోసఫ్, ఫాదర్ ఇన్నయ్య, కమిటీ నిర్వాహకులతో కలిసి ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బర్నాబాస్ మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ నేతలు బ్రదర్ సురేంద్రబాబు, రెవరెండ్ రాజశేఖర్ దాసరి, బ్రదర్స్ దాసరి రాజేష్, ఎం.బాబు, డి.బాబు, భరత్, స్వరూప్, ఎ.దాసు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కిమ్స్‌లో 'ప్రీ క్రిస్మస్'



నెల్లూరు సిటీ : నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, టెక్నీషియన్లు, సిబ్బంది కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు మాట్లాడుతూ ఇలాంటి వేడుకల ద్వారా పనిఒత్తిడిని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. కార్డియాలజిస్టులు శ్రీనివాసరాజు, సాహెబ్‌పీరా, వైద్యులు జనార్దన్‌రావు, లక్ష్మీదుర్గా, ఏపీరెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి



నెల్లూరు(బృందావనం) : దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని వి.హరినాథ్ (ఒంగోలు) ప్రవచించారు. బాలాజీనగర్‌లోని శ్రీసాయిదర్బార్ -ద్వారకామయిలో బుధవారం నిర్వహించిన శ్రీగురుచరిత్ర ఏకాదశ ప్రవచన మహాయజ్ఞంలో హరినాథ్ పాల్గొని ఉపన్యసించారు. గురుచరిత్రలోని పదో అధ్యాయం నుంచి 21వ అధ్యాయంలోని నృసింహ సరస్వతి స్వామి లీలా విశేషాల వరకు వివరించారు. కార్యక్రమాలను నిర్వాహకులు కంజర్ల భాస్కరశర్మ, ఆశం విజయసారథి, మధుసాయి పర్యవేక్షించారు.

23న రామకోటి గళార్చన మహాయజ్ఞం

నెల్లూరు(బృందావనం) : ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీరామకోటి గళార్చన మహోత్సవ మహాయజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు ఆలూరు శిరోమణి శర్మ బుధవారం తెలిపారు. అయోధ్యలో జనవరిలో శ్రీరాముని అపూర్వ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వివరించారు.